

ధూమపానం.. పోయేను ప్రాణం!

ధూమపానం ఓ ఫ్యాషన్‌గా మారింది. యువత పొగాకు మత్తులో ఊగిసలాడుతున్నారు. నేడు 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం' సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

8లో ▸



దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలి

నర్సాపూర్(జి): జూన్ 2 నుంచి 22 వరకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నర్సాపూర్(జి) మండల పరిషత్ అధికారులతో మాట్లాడారు.

గరిష్టం/కనిష్టం
41.4/29.4

వాతావరణం

ఆకాశం కొంతమేరక మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం తర్వాత ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోత కూడా అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి



మిఠాయిలు పంచుతున్న డీఎం అమృత

భైంసాటౌన్: ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని భైంసా డీఎం అమృత అన్నారు. సోమవారం ఒక్కరోజే డిపోకు రూ.15,10,280 ఆదాయం వచ్చిందని తెలిపారు. డిపోకు మొదటిసారిగా 50 ఈపీకే (ఎర్నింగ్ పర్ కిమీ) దాటిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉద్యోగులకు స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో సంస్థకు మెరుగైన ఆదాయం వచ్చేలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ కిషన్, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, సాంబయ్య పాల్గొన్నారు.

అదనపు బాధ్యతలపై విచారణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో జిల్లాస్థాయి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పీజీహెచ్‌ఎంను అదనపు బాధ్యతల నుంచి తొలగించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. మంజులాపూర్ పీజీహెచ్‌ఎంను సర్వశిక్ష అభియాన్ నిబంధనలకు విరుద్ధంగా డీఈవో కార్యాలయంలో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారిగా, అదనపు పరీక్షల కమిషనర్‌గా రెండు బాధ్యతలు అప్పజెప్పడం సరికాదన్నారు. ఉన్నతాధికారుల తీరుతో విద్యార్థులకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. అదనపు బాధ్యతలు చేపట్టిన సంబంధిత అధికారి సైతం పీజీహెచ్‌ఎం స్థానంలో మరో జూనియర్‌కు బాధ్యతలు ఇచ్చి డీఈవో కార్యాలయంలోనే ఉంటున్నారని తెలిపారు. జిల్లాస్థాయి బాధ్యతలు తీసుకోవడంపై కలెక్టర్ సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నెహ్రూనాయక్, బుక్యా రాము తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలు అన్నదాతను వెంటాడుతూనే ఉన్నాయి. పంటలు కోతకు వచ్చే సమయంలో కురిసిన వడగండ్ల వనాలకు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం మిగిలిన పంటను కోసి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ఈ తరుణంలో వరణుడు మళ్లీ రైతులకు నష్టం కలిగిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జిల్లాలోని లక్ష్మణచాంద, కుంటాల, ఖానాపూర్, కడెం మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో చాలా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడిసింది. రాత్రి వేళ వర్షం కురవడంతో చాలా మంది రైతులు ధాన్యం కాపాడుకోవడానికి ఇబ్బంది పడ్డారు. కొనుగోలు కేంద్రాలకు లారీలు రాక తూకం వేసిన ధాన్యం బస్తాలు కూడా వర్షానికి తడిశాయి.



ఖానాపూర్ కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు

అకాల నష్టం

- జిల్లాలోని పలు మండలాల్లో వర్షం
- కల్లాల్లోనే ధాన్యం కుప్పలు
- లారీలు రాక తూకం ఆలస్యం..
- ధాన్యం కొనాలని రైతుల ఆందోళన

లక్ష్మణచాంద: మండలంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని రాచాపూర్, వడ్యాల్, కనకాపూర్, పీచర, లక్ష్మణచాంద, మునిపెల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. తూకం వేసిన ధాన్యం బస్తాలు కూడా తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తూకం వేసిన ధాన్యం తరలింపులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండంతో రైతులు నష్టపోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. తూకం వేసిన ధాన్యం ఏరోజుకారోజు మిల్లులకు తరలించేలా చూడాలని డిమాండ్ చేశారు. కొన్ని గ్రామాల రైతులు నిర్మల్ వెళ్లి లారీల యజమానులతో మాట్లాడినా ఫలితం ఉండడం లేదని పేర్కొంటున్నారు. బస్తాకు రూ.10 అదనంగా ఇస్తామన్నా లారీలు రావడం లేదని పేర్కొంటున్నారు.

కుంటాల మండలంలో..

కుంటాల: మండలంలోని ఓలా, వెంకూర్, అందాకూర్, అంబకంటి, దౌనెల్లి, కుంటాల గ్రామాల్లో మంగళవారం వేకువజామున మోస్తరు వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న మొక్కజొన్న, వరి ధాన్యం తడిసింది. రైతులు ధాన్యం కుప్పలపై టార్పాలిన్‌లు కప్పి ఉంచినా ఈదురుగాలులతో వర్షం కురవడంతో చాలా మంది రైతుల ధాన్యం తడిసింది. మంగళవారం ఉదయం ధాన్యం వద్దకు చేరుకున్న రైతులు నీటిని తొలగించి ఆరబెట్టే పనిలో పడ్డారు. మరోవైపు వర్షానికి కుంటాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మంగళవారం మరమ్మతు చేశారు.



కుంటాల : మొక్కజొన్న బస్తాలపై నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు



లక్ష్మణచాంద: తడిసిన ధాన్యం బస్తాలు



కుంటాల: వడ్లపై వాననీళ్లు తొలగిస్తున్న రైతు

ఖానాపూర్ మండలంలో..

ఖానాపూర్: మండలంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఖానాపూర్ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఖానాపూర్ పీఏసీఎస్, సత్తనపల్లి పీఏసీఎస్‌తోపాటు ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోళ్లలో జాప్యం చేస్తుండడంతో తాము నష్టపోతున్నామని పేర్కొంటున్నారు. లారీలు రావడం లేదని తూకం నిలిపివేస్తున్నారని పేర్కొంటున్నారు. గన్నీ సంచుల కొరత కూడా ఉందని తెలిపారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంతోపాటు మండలంలోని సత్తనపల్లి, మస్కాపూర్, బీర్నంది, పాత ఎల్లాపూర్, రాజురా గ్రామాల్లో ఎక్కువ నష్టం జరిగింది.

కడెం మండలంలో..



నినాదాలు చేస్తున్న రైతులు

కడెం: అకాల వర్షంతో మండలంలోని లింగాపూర్, కొత్తమద్దిపడగ, ధర్మాజీపేట్ తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. ధాన్యం కుప్పలు, బస్తాలపై కవర్లు కప్పి ఉంచినా లాభం లేకపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలించాలని, తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని లింగాపూర్ గ్రామానికి చెందిన రైతులు మంగళవారం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ బస్టాండ్ సమీపంలో నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని, లారీల కొరత తీర్చాలని నినదించారు. ఈనెల 26న ఆందోళన చేసినా సమస్య పరిష్కరించలేదని తెలిపారు. కలెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ రావాలని డిమాండ్ చేశారు. పీఏసీఎస్ సీఈవో వచ్చి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రైతులతో కలిసి ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య, ఎస్సై రాజు లింగాపూర్ కొనుగోలు కేంద్రానికి వెళ్లి కొనుగోళ్లు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతుల రాస్తారోకోతో కడెం–ఖానాపూర్ వైపు సుమారు గంటకుపైగా వాహనాలు నిలిచిపోయాయి. కాంగ్రెస్ పార్టీ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గభవాని రైతులకు మద్దతు తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే రైతులకు నష్టం..



ఖానాపూర్‌లో రాస్తారోకో..

ఖానాపూర్: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే ప్రభుత్వమే కొనుగోలు చేయడంలో విఫలం కావడంతో అన్నదాత నష్టపోతున్నాడని కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్ విమర్శించారు. తడిసిన ధాన్యం కొనాలని, తూకం వేసిన ధాన్యం తరలించాలని పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో చేశారు. వీరికి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ఖానాపూర్ పీఏసీఎస్ సీఈవో ఆశన్న అక్కడికి చేరుకుని తడిసిన ధాన్యం కొంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఖానాపూర్–కడెం రహదారిపై రాస్తారోకో..

పాత ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని ఒడ్డెవాడలోని ఖానాపూర్–కడెం ప్రధాన రహదారిపై బీర్నంది కొనుగోలు కేంద్రానికి చెందిన రైతులు రాస్తారోకో చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సై ఆర్.శంకర్ అక్కడికి చేరుకుని సమస్య పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో జూన్ 4న నిర్వహించే సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ శ్రేణులను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్‌లో నిర్మల్ నియోజకవర్గస్థాయి ముఖ్యకార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జూన్ 4న నిర్మల్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం, పార్టీ జిల్లా కార్యాలయాన్ని సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడతారని తెలిపారు. సభకు పెద్దఎత్తున బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకుని ఆయనపై అభిమానంతో ప్రజలు భారీగా సమావేశానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, నిర్మల్ మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటరాంరెడ్డి, నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మరుగొండ రాము, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న కేసీఆర్



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ టౌన్: రాష్ట్రంలో అన్ని శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని, ఉద్యమ సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న మహోన్నత వ్యక్తి సీఎం కేసీఆర్ అని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కొనియాడారు. వైద్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఏ, ఫార్మసిస్ట్ ఉద్యోగులను ప్రభుత్వం ఇటీవలే క్రమబద్ధీకరణ చేసింది. ఈ సందర్భంగా వారు జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఐకేరెడ్డిని మంగళవారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రితో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం కూడా చేయలేని పనులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. నిర్మల్‌కు మెడికల్ కాలేజ్ వచ్చిందని, త్వరలో నర్సింగ్ కాలేజ్ కూడా వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 33 జిల్లాల ప్రజల కోసం ప్రతీ జిల్లాకు ఒక కోర్టును ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అదేవిధంగా మతాలకు అతీతంగా ప్రార్థన మందిరాలు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

ఇక వడివడిగా 'బడిబాట'



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు(ఫైల్)

- జూన్ 3 నుంచి 17వరకు...
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ

నిర్మల్‌ఖిల్లా: బడీడు పిల్లలంతా బడిలో ఉండేలా అవగాహన కల్పించేందుకు.. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలవైపు మళ్లించేందుకు పాఠశాల విద్యాశాఖ బడిబాటకు సన్నద్ధమవుతోంది. జూన్ 3 నుంచి 17 వరకు పండుగ వాతావరణంలో 'ఆచార్య జయశంకర్ బడిబాట' కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. ప్రభుత్వ బడులు సాధించిన మెరుగైన ఫలితాలను విస్తృతంగా ప్రచారం చేసి నమోదుశాతం పెంచేందుకు ప్రణాళిక అమలు చేయబోతున్నారు. ప్రభుత్వ బడిని బతికించుకునేందుకు ప్రైవేటును తలదన్నే ప్రచార వ్యూహాలు సిద్ధం చేశారు. ప్రతీ గ్రామంలో 'గ్రామ విద్యా రిజిస్టర్' తప్పకుండా నిర్వహించాలని, బయట ఉన్న విద్యార్థుల వివరాలు గుర్తించవచ్చని భావిస్తున్నారు.

జిల్లాలో ఇలా...


జిల్లాలో ప్రభుత్వరంగంలో అన్నిరకాల యాజమాన్యాలు కలిపి 842 పాఠశాలలు ఉన్నాయి. సుమారు 60 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇప్పటికీ కొంత మంది పిల్లలు అక్కడక్కడా ఇటుక బట్టీల్లో.. యాచక వృత్తిలో.. పశువుల కాపరులుగా.. హోటళ్లు, కిరాణ దుకాణాల్లో బాలకార్మికులుగా పనిచేస్తున్నారు. బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించడం.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం 'బడిబాట' ప్రధాన ఉద్దేశం. అందుకే అంగన్‌వాడీ పూర్తి చేసిన పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించడం.. బాలికల విద్యను ప్రోత్సహించడం.. హాజరు నమోదు తక్కువగా ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టడం.. పోషకుల సమావేశం నిర్వహించడం.. గుణాత్మక విద్య సాధనకు చేస్తున్న కృషిని వివరించి స్వచ్ఛంద సంస్థలు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, దాతల సాయం తీసుకొని పాఠశాల అభివృద్ధికి పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకోవడం, పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులను, ఉపాధ్యాయులను సన్మానించడం లాంటివి ప్రాధాన్య అంశాలుగా గుర్తించారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులను, రాష్ట్రమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో కలిసి సన్మాన కార్యక్రమాన్ని ఇప్పటికే పూర్తి చేశారు.

బడిబాట షెడ్యూల్...

జూన్ నెల 3 నుంచి 9వ తేదీ వరకు ప్రతిరోజూ 7 నుంచి 11 గంటల వరకు అన్ని పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ద్వారా ప్రతీరోజు ఇంటింటా ప్రచారం నిర్వహించాలి. మన ఊరు మన బడి కింద రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు, సమాజానికి వివరించాలి. పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడం ద్వారా ప్రయోజనాలు వివరించి, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పుకోవాలి. బడి బయట ఉన్న పిల్లలను, ఎక్కువ కాలం గైర్హాజరైన వారిని గుర్తించి, పాఠశాలల్లో చేర్పించేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి..

12వ తేదీ నుంచి 17 వరకు నిర్వహించే కార్యక్రమాలు..
12న మన ఊరు మన బడి–మన బస్తీ మనబడి
13న ఎఫ్‌ఎల్‌ఎన్ తొలిమెట్టు కార్యక్రమం అమలుతీరు
14న సామూహిక అక్షరాభ్యాసాలు–బాలసభల నిర్వహణ
15న ప్రత్యేక అవసరాలుగల పిల్లలు,బడి బయట గల పిల్లల నమోదు
16న ఆంగ్లమాధ్యమ పాఠశాలల పట్ల అవగాహన–ద్విభాషా పాఠ్యపుస్తకాల ప్రాముఖ్యత
17న బాలిక విద్య – కెరీర్ మార్గదర్శకత్వం వంటి అంశాలను రోజువారీగా చేపడతారు.

ప్రణాళికలు సిద్ధం చేశాం



ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. మార్గదర్శకాలకను గుణంగా బడిబాట కార్యక్రమం కోసం తగిన ప్రణాళికలు సిద్ధం చేశాం. షెడ్యూల్ ప్రకారంగా పండుగ వాతావరణంలో రోజువారీ కార్యక్రమాలు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో నిర్వహించాలి. విద్యార్థుల నమోదుశాతం పెంచాలి. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో

'జెడ్పీ'లో వడ్ల పంచాయితీ!

- ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై సభ్యుల ఆందోళన
- బస్తాకు 3 కిలోల తరుగు తీస్తున్నారని ఆగ్రహం
- అది కామనే అన్న సోన్ జెడ్పీటీసీ
- మైక్ కట్ చేయడంపై విపక్ష సభ్యుల నిరసన
- మంత్రి జోక్యంతో సద్దుమణిగిన వివాదం



మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



మైక్ ఇవ్వాలని పోడియం ముందు బైఠాయించిన పెంబి జెడ్పీటీసీ జానుబాయి

నిర్మల్ రూరల్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వడ్ల పంచాయితీతో వాడీ వేడిగా జరిగింది. జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జెడ్పీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి హాజరయ్యారు. మొదట పదో తరగతి ఫలితాల్లో జిల్లా మొదటి స్థానంలో నిలవడంతో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను సభ్యులు అభినందించారు. అనంతరం ధాన్యం కొనుగోళ్ల అంశాన్ని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. దీంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని పలువురు సభ్యులు ఆరోపించారు. దీంతో రోజుల తరబడి రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. అకాల వర్షాలకు ధాన్యం తడుస్తోందని పేర్కొన్నారు. సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... ధాన్యం బస్తాపై మూడు కిలోల వరకు తరుగు తీస్తున్నారని తెలిపారు. ఇప్పటికే వడగండ్ల వర్షాలతో నష్టపోయిన రైతులను తరుగు పేరుతో దోపిడీ చేయడం సరికాదన్నారు. సోన్ జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి కలుగజేసుకుని తరుగు తీయడం కామనే అని అన్నారు. అంతటా జరుగుతోందని పేర్కొన్నారు. కావాలనే కొనుగోళ్లపై రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. దీంతో రాజేశ్వర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతుండగా అధికారులు మైకు కట్ చేశారు. దీంతో రాజేశ్వర్‌రెడ్డి పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. జిల్లాలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని సభ దృష్టికి తెచ్చేందుకు మైక్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో మైక్ ఇవ్వగా సమస్యలపై మాట్లాడారు. ఈ క్రమంలో మళ్లీ మైక్ కట్‌చేశారు. దీంతో అసహనానికి గురైన రాజేశ్వర్‌రెడ్డి మైక్ విసిరేసి బయటకు వెళ్లిపోయారు.

పోడియం ఎదుట బైఠాయించిన పెంబి జెడ్పీటీసీ..

మండలంలోని సమస్యలను సభ దృష్టికి తీసుకురావడానికి అధికారులు తనకు మైకు ఇవ్వడం లేదని పెంబి జెడ్పీటీసీ జానుబాయి పోడియం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. గత వర్షాకాలంలో మండలంలో పసుపుల బ్రిడ్జి కొట్టుకుపోయిందని తెలిపారు. ఇంతవరకు మరమ్మతులు చేయలేదని పేర్కొన్నారు. రెండేళ్లుగా పెంబి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం లేదని తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి జోక్యం చేసుకోవడంతో అధికారులు మైక్ ఇచ్చారు. దీంతో సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం విషయాన్ని ఎమ్మెల్యే రేఖానాయక్ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కోరం లేకనే పెంబి సర్వసభ్య సమావేశం తరచూ వాయిదా పడుతోందని పేర్కొన్నారు. ప్రతీ అంశాన్ని రాజకీయం చేయకుండా ప్రజా సమస్యలపై మాట్లాడాలని సూచించారు. సభలో ప్రతిపక్షాలు హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు.

ధాన్యం కొనుగోళ్లను రాజకీయం చేయొద్దు..

ధాన్యం కొనుగోళ్లపై రాజకీయం చేయడం సరికాదని మంత్రి అన్నారు. జిల్లాలో లారీల కొరత లేదని తెలిపారు. కూలీలు తక్కువగా ఉన్నారని, బీహార్ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలపై ఆధారపడుతున్నామన్నారు. కూలీల కొరతతో ధాన్యం అన్‌లోడింగ్ ఆలస్యం అవుతోందని తెలిపారు. అన్‌లోడ్ వేగవంతం చేయాలని కలెక్టర్‌కు సూచించామని పేర్కొన్నారు. వడగండ్ల వానకు రైతులకు నష్టం జరుగుతున్న మాట వాస్తవమే అని తెలిపారు. రైతులకు నష్టం జరుగకుండా ఏం చర్యలు తీసుకోవాలో సూచించాలని సీఎం కేసీఆర్ సబ్ కమిటీ వేశారని తెలిపారు.

పంటలు ముందే వేసుకోవాలి..

జిల్లాలో రైతులందరూ ఈసారి పంటలు ముందుగానే వేసుకోవాలని మంత్రి సూచించారు. నల్లగొండ, బాన్సువాడలో ఈవిధానం సత్ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. ఈమేరకు ఏఈవోలు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పంటలు ముందుగా వేసుకుంటే వడగండ్ల ప్రభావం తగ్గుతుందని తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయాలి..

జూన్ 2 నుంచి నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. వేడుకల్లో భాగంగా జూన్ 4న ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాకు రానున్నారని తెలిపారు. నూతన కలెక్టరేట్ ప్రారంభిస్తారని, మెడికల్ కాలేజీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించనున్న గిరిజన భవనం, బంజారా భవన్‌కు శంకుస్థాపన చేస్తారని వివరించారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీ సీఈవో సుధీర్, ఖానాపూర్, ముథోల్ ఎమ్మెల్యేలు రేఖానాయక్, విఠల్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీజీబీని సందర్శించిన వరల్డ్ బ్యాంక్ బృందం



సీఎస్పీ సభ్యులతో బృందం సభ్యులు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌ను మంగళవారం న్యూయార్క్‌లోని వరల్డ్ బ్యాంక్ బృందం సభ్యులు నిర్మల వెదుల, గౌరవ్ బామ్మి, దీపాక్ అలోక్ సందర్శించారు. టీజీబీ పరిధిలో నిర్వహిస్తున్న కస్టమర్ సర్వీస్ పాయింట్ (సీఎస్పీ) యూనిట్‌ను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతంలో బ్యాంక్ లింకేజీ ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం, ఉపాధి కల్పనకు రుణాలు మంజూరు చేయడం, రికవరీ చేయడం, ఇన్సూరెన్స్ చేయించడంలో సీఎస్పీ పనితీరును పరిశీలించారు. జీఎం, ఐటీ విభాగం అధికారి మహేశ్, ఆర్‌ఎం వెంకటరమణారెడ్డి, బ్రాంచ్ మేనేజర్ జగదీశ్‌బాబు, ఫీల్డ్ ఆఫీసర్ వినీత్, సీఎస్పీ సభ్యురాళ్లు నవనీత, రేఖ, లక్ష్మి మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీశ్రీ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో రెండు పశువులు మృతి



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతిచెందిన ఎద్దు, ఆవు

తాంసి: భీంపూర్ మండలం గుబిడి గ్రామ శివారులోని పంటచేనులోగల ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంగళవారం విద్యుదాఘాతంతో రెండు పశువులు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన రైతు అంగ గోపాల్ పశువులు శివారులోని పంటచేలకు మేతకు వెళ్లాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేస్తున్నాయి. ఈ క్రమంలో పశువులకు ఎర్తింగ్ వైరు తగిలి విద్యుత్ సరఫరా కావడంతో ఘటనా స్థలంలో విద్యుదాఘాతంతో ఆవు, ఎద్దు మృతి చెందాయి. మృతిచెందిన పశువులను విద్యుత్‌శాఖ ఏఈ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. సుమారు రూ.లక్ష మేర నష్టం జరిగినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

వృద్ధుడి అదృశ్యం



గంగారాం (ఫైల్)

భైంసారూరల్: దేగాం గ్రామానికి చెందిన పల్లెపు గంగారాం (70) అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... గంగారాం ఈనెల 28న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటినుంచి కుటుంబీకులు తెలిసిన వారి, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం అతడి భార్య వెంకూబాయి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

నేరడిగొండ: ఆర్టీసీ బస్సుకు పెనుప్రమాదం తప్పింది. మండల కేంద్రంలోని వడూర్ వెళ్లే రహదారి బస్టాప్ వద్ద మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. ఆర్టీసీ నిర్మల్ డిపో నుంచి బస్సు మహారాష్ట్రలోని కిన్వట్‌కు వెళ్తోంది. మండల కేంద్రంలోని వడూర్ బస్టాప్ వద్ద బస్సు ఆగగా కొందరు ప్రయాణికులు దిగారు. మిగతావారు బస్సులో ఎక్కుతుండగా ఎదురుగా ఉన్న దుకాణా యజమాని పొల్కం ప్రవీణ్ బస్సు కింద డీజిల్ పైపు నుంచి మంటలు రావడం గమనించాడు. వెంటనే బస్సు డ్రైవర్‌కు తెలిపాడు. డ్రైవర్ ప్రయాణికులను కిందికి దింపాడు. సమీప హోటళ్ల నుంచి నీటిని తీసుకొచ్చి మంటలు ఆర్పివేశారు. ఎలాంటి నష్టం లేకుండా ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం నిర్మల్ డిపో నుంచి మెకానిక్‌లు వచ్చి బస్సుకు మరమ్మతు చేశారు.

నిర్మల్‌చైన్‌గేట్: ఆధునిక కాలంలో ధూమపానం ఓ ఫ్యాషన్‌గా మారింది. ముఖ్యంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న యువత పొగాకు మత్తులో ఊగిసలాడుతున్నారు. ఆడ, మగ తేడా లేకుండా నేటి యువత మత్తుకు బానిసవుతున్నట్లు వైద్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. పొగాకుతో పాటు మరికొన్ని మత్తుపదార్థాలు కలిపి ధూమపానం చేస్తూ నేటి యువత చేజేతుల అనారోగ్యం బారిన పడుతోంది. దీంతో ఊపిరితిత్తుల సమస్యలు, ఉబ్బసం, గ్యాస్ట్రిక్, క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 25 ఏళ్ల వయస్సుగల యువకులు ధూమపానంతో నోటి, గొంతు క్యాన్సర్‌తో ప్రాణాలు కోల్పోతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పొగాకు కారణంగా చాలామంది అనారోగ్యం బారిన పడుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. నేడు 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం' సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

ధూమపానం.. పోయేను ప్రాణం!

- నేడు పొగాకు వ్యతిరేక దినం



- సిగరెట్లకు బానిసవుతున్న మైనర్లు
- విచ్చలవిడిగా గుట్కాల విక్రయాలు
- ఊపిరితిత్తుల ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని డబ్ల్యూహెచ్‌వో పిలుపు

ఊపిరితిత్తులపై ప్రభావం..

రెండేళ్లపాటు మృత్యు ఘంటికలు మోగిస్తూ ప్రపంచాన్ని కలవర పెట్టింది కరోనా. ఈ వైరస్‌కు బలై ఎందరో ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో ఆక్సిజన్ అందక మరణించినవారే ఎక్కువ. ఊపిరితిత్తుల ఊపిరి తీస్తున్న అనేక కారకాల్లో పొగాకు ముఖ్యమైంది. పొగాకు హుక్కా, చుట్ట, బీడీ, సిగరెట్, ఖైనీ తదితర రూపాల్లో మార్కెట్‌లో అందరికీ చేరువలో లభ్యమయ్యే మత్తు పదార్థం. పొగ తాగడంతో నోటి దుర్వాసన, గొంతు వ్యాధులు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్, కఫం, దగ్గు, దమ్ము, ఆయాసం, గుండె కవాటాలు మూసుకుపోయి గుండెపోటు, రక్తపోటు, క్యాన్సర్ లాంటి రోగాలు వస్తాయి.

ప్రజలకు అవగాహన కల్పించాలని..

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో 1987 నుంచి ప్రతీ సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినంగా పాటిస్తున్నారు. ఈ సందర్భంగా పొగాకు అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. నేడు పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా ఊపిరితిత్తుల ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చింది.

కాలక్రమంలో మార్పు..

నాలుగు దశాబ్దాల క్రితం పొగాకు ఎండబెట్టి శుభ్రపరిచి దానిని పాయలుగా విడదీసి ఎండిన ఆకుల్లో చుట్టి గ్రామీణ ప్రాంతాల్లో పురుషులు, అక్కడక్కడా మహిళలు పీలుస్తుండేవారు. కాలక్రమంలో పొగాకు చుట్టల స్థానంలోకి బీడీలు చేరాయి. ఆ తర్వాత ఫ్యాషన్ సిగిరెట్లు వచ్చాయి. వీటిలో ఫిల్టర్ సిగిరెట్లు అంటూ ఉన్నత వర్గాల కోసం ఖరీదైనవి కూడా అందుబాటులోకి వచ్చాయి. కాలక్రమంలో పొగాకు చుట్టలు కనుమరుగైపోతున్నాయి. ఇప్పుడు సిగరెట్ల రూపంలో నుంచి గుట్కాగా మారింది. పొగాకు అలవాటు పడిన వారి జేబులోకి గుట్కా చేరి చివరకు ఆ వ్యసనంలో ఉన్నవారి ప్రాణాలకు ముప్పు తెస్తోంది.

మితి మీరితే అంతే..

కార్పొరేట్ విద్యలో ఇంటర్ స్థాయిలోనే యువతీయువకులు ఒత్తిడి పేరుతో సిగరెట్లకు అలవాటు పడుతున్నారు. కాలక్రమంలో పొగాకు మోతాదు పెంచుతూ మత్తులో ఊగిసలాడుతున్నారు. గతంలో గుట్టుచప్పుడు కాకుండా పొగాకు ధూమపానం తీసుకునేవారు. కానీ.. నేడు పాన్‌షాపులు, మద్యం దుకాణాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, టీ స్టాళ్లు, పబ్లిక్ ప్లేసులు అక్కడ.. ఇక్కడ.. అనే తేడా లేదు.. ప్రతీచోటు పొగరాయుళ్లకు అడ్డాలుగా మారింది.

నిషేధించినా జోరుగా విక్రయాలు

1980లో చుట్టల వాడకంతో.. నేడు గుట్కాలతో మనిషి ఆరోగ్యం మంట గలుస్తోంది. గుట్కా సిగరెట్ యువతకు ఫ్యాషన్‌గా మారింది. గ్రామీణ ప్రాంతాల బాలకార్మికులు కూడా విపరీతంగా గుట్కాలకు అలవాటు పడుతున్నారని వైద్యాశాఖ సర్వేలో తేలింది. దీంతోనే వేల సంఖ్యలో క్యాన్సర్ కేసులు నమోదు కావడంతో ప్రభుత్వం పొగాకు పదార్థాలు నిషేధించింది. కానీ.. గుట్టుచప్పుడు కాకుండా గుట్కా అమ్మకాలు ఇంకా జోరుగానే సాగుతున్నాయి. బజార్లలో బండి కొట్ల నుంచి కిరాణాదుకాణాల వరకూ చాక్లెట్ల కంటే తేలిగ్గా గుట్కాలు అందుబాటులో ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. కాగా, పొగాకు అలవాటు జీవన కాలాన్ని తగ్గిస్తుంది. ఒక సిగరెట్ తాగితే 11 నిమిషాల ఆయుష్షు తగ్గుతుంది. పొగ తాగే వారు ఇంట్లో ఉండడంతో కుటుంబ సభ్యులకు వ్యాధులు సోకే అవకాశం లేకపోలేదు. ప్రతీ 100 మందిలో 80 నుంచి 90 మందికి క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు.

పొగాకుతో వచ్చే వ్యాధులు

- ఊపిరితిత్తుల క్యాన్సర్
- దీర్ఘకాలిక శ్వాసకోస వ్యాధులు
- క్షయ
- గొంతు, నోటి క్యాన్సర్
- వ్యాధి నిరోధక శక్తి తగ్గుదల

మానేయడమే ఉత్తమ మార్గం



పొగాకు పీల్చే వారితో పాటు సమీపంలో ఉన్న వారిపై కూడా ప్రభావం పడుతుంది. పీల్చడం ప్రారంభంలో ఫ్యాషన్‌గా ఉంటుంది. ఆ తర్వాత ఊపిరితిత్తుల క్యాన్సర్, ఆస్తమా, గుండెజబ్బులు, మెదడు, కంటి శుక్లాల వ్యాధులు, నోరు, గొంతు ఇలా శరీరంలోని పలు అవయవాలు చెడిపోతాయి. పొగాకు పీల్చడం మానేయడమే క్యాన్సర్, అన్ని వ్యాధుల నివారణకు 50 శాతం ఉత్తమ వైద్యం. పొగ పీల్చడంతో నాలుగు వేల రకాల రసాయనాలు, 43 రకాల క్యాన్సర్ కారకాలు, 400 రకాల విషపదార్థాలు విడుదలవుతాయి. పొగాకు ఉత్పత్తుల వాడకం తగ్గిస్తే మంచిది.

– అశ్విర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా ఆస్పత్రి వైద్యుడు

నిర్మల్‌జిల్లా.. సాహితీఖిల్లా

- రాష్ట్రమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- 'కౌమారామృత శతకం' ఆవిష్కరణ



కౌమారామృత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: కవులు, కళాకారులకు నిర్మల్ జిల్లా సాహితీ ఖిల్లాగా పేరుగాంచిందని రాష్ట్రమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో ప్రముఖకవి, రిటైర్డ్ ఎంపీడీవో చట్ల గజ్జరాం రచించిన 'కౌమారామృత శతకం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గోదావరి నది పరీవాహక ప్రాంతమైన నిర్మల్ జిల్లా కవులు, కళాకారులకు ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు. కౌమారదశ (టీనేజ్)లో వచ్చే మార్పుల గురించి గజ్జరాం తన అనుభవాలను జోడించి పుస్తకం రాయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి రాంకిషన్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వట్టిమల్ల నర్సయ్య గౌడ్, కవులు బొందిడి పురుషోత్తమరావు, డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, పత్తి శివప్రసాద్, అంబటి నారాయణ, తోడిశెట్టి పరమేశ్వర్, గుమ్ముల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

20మందికి జరిమానా.. ఇద్దరికి జైలు

నిర్మల్ టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి జరిమానా, ఇద్దరికి మూడురోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పు నిచ్చినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని నిర్మల్ కోర్టులో హాజరు పరిచారు. 20మందికి రూ.21,900 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

రాయిని చెక్కి.. బొమ్మగా మలిచి..



కుంబోజీ భాస్కర్ చెక్కిన దేవతల విగ్రహాలు

- అద్భుత శిల్పాలు రూపొందిస్తున్న కుంబోజీ భాస్కర్



లక్ష్మణుడి విగ్రహాన్ని చెక్కుతున్న భాస్కర్

ఇచ్చోడ: రాళ్లను శిల్పాలుగా మలిచి బతుకు వెల్లదీస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు కుంబోజీ భాస్కర్. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం అడేగామ (కే) గ్రామానికి చెందిన భాస్కర్ తన తండ్రి రమణయ్య వద్ద వారసత్వంగా ఈ కళను నేర్చుకున్నాడు. ఇతడు ఇప్పటివరకు చెక్కిన వేలాది విగ్రహాలు ప్రస్తుతం నిత్యపూజలు, నీరాజనాలు అందుకుంటున్నాయి. భాస్కర్ రాళ్లకు జీవం పోస్తూ అందమైన కళాఖండాలను తీర్చిదిద్దడంలో దిట్ట. సిరిచెల్మ అటవీ ప్రాంతంలో లభించే బలపం, నల్లరాళ్లను విగ్రహాల తయారీకి ఉపయోగిస్తున్నాడు.

దేవతామూర్తుల విగ్రహాలు..

ఆంజనేయుడు, సీతారామలక్ష్మణుడు, శివపార్వతులు, నంది, శివలింగాలు, గ్రామదేవతలు, బ్రహ్మంగారు, అంబేద్కర్, కొమురం భీం, ఇందిరాగాంధీ, వినాయకుడు తదితర విగ్రహాల తయారీలో భాస్కర్ సిద్ధహస్తుడు. ఎలాంటి ఆర్డర్ ఇచ్చినా అచ్చుగుద్దినట్లు.. అవలీలగా విగ్రహం తయారు చేసి ఇవ్వగలడు.

వేల విగ్రహాల తయారీ..

భాస్కర్ రాయితో చెక్కిన విగ్రహాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోనూ కనిపిస్తాయి. ఆయా రాష్ట్రాల వారు విగ్రహాల తయారీకి భాస్కర్‌కు ఆర్డర్ ఇస్తారు. ఫొటోలో ఉన్నట్లుగా దేవతల విగ్రహాల తయారీలో భాస్కర్ సిద్ధహస్తుడు. మూడు ఫీట్ల నుంచి నాలుగు ఫీట్ల ఎత్తు కలిగిన విగ్రహాలను అద్భుతంగా తయారు చేస్తాడు. ఒక్కో విగ్రహం తయారీకి కనీసం నెల పడుతుంది. విగ్రహం మలిచే చివరి దశలో ఒక్కోసారి రాయి తగలి పగిలిపోతే అతడి శ్రమంతా వృథా అయ్యే ప్రమాదం కూడా లేకపోలేదు.

ఒక్కో విగ్రహానికి ఒక్కో ధర..

ఒక్కో విగ్రహానికి ఒక్కో ధర ఉంటుంది. మూడు అడుగుల ఆంజనేయుడి విగ్రహం రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ఉంటుంది. నాలుగైదు విగ్రహాలు ఆర్డర్ ఇస్తే రూ.30నుంచి రూ.40 వేల వరకు అవుతుంది. ప్రస్తుతం విగ్రహాల తయారీకి వినియోగించే రాయి కూడా దొరకడం చాలాకష్టంగా మారిందని భాస్కర్ చెబుతున్నాడు. భూమిలోంచి తవ్వి తీసి దాదాపుగా 30కిలో మీటర్ల దూరం నుంచి రాయిని తీసుకురావడం కష్టంగా మారిందని వాపోతున్నాడు.

ప్రభుత్వం గుర్తింపునివ్వాలి

కళాకారులకు తెలంగాణ ప్రభుత్వం గుర్తింపునివ్వాలి. ఎంతో శ్రమపడి విగ్రహాలు తయారు చేస్తూ కళను బతికిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం మాలాంటి పేద కళాకారులకు గుర్తింపునిచ్చి అన్ని విధాలుగా ఆదుకోవాలి.

– కుంబోజీ భాస్కర్, శిల్పకళాకారుడు

కుంచెపడితే అద్భుత చిత్రమే..

- చిత్రలేఖనంలో రాణిస్తున్న రమేశ్
- కలర్స్ లేకుండా జీవకళ ఉట్టిపడేలా బొమ్మలు వేయడం అయన ప్రత్యేకత



థర్మోకోల్‌తో తయారు చేసిన గాంధీ బొమ్మ



రమేశ్ గీసిన నూతన సచివాలయం చిత్రం



మంత్రి హరీశ్‌రావుకు తాను గీసిన చిత్రాన్ని అందజేస్తున్న రమేశ్ (ఫైల్)

కైలాస్‌నగర్: తను కుంచె పడితే చాలు.. చిత్రం చిరునవ్వు నవ్వుతుంది.. బొమ్మకి ప్రాణమొస్తుంది. మనసులోని భావాలను పేపర్‌పై అందంగా చూపించగలడు. కలర్స్‌తో పనిలేకుండా జీవకళ ఉట్టిపడే చిత్రాలను సాక్షాత్కరింపగలడు. అభిరుచి, ఆసక్తి ఉండాలే గానీ కళకు పేదరికం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన ద్యావంత్ రమేశ్. చిన్నతనం నుంచే చిత్రలేఖనంపై ఆసక్తి పెంచుకున్న అద్భుతమైన చిత్రాలను గీస్తూ ఔరా అనిపించుకుంటున్నాడు. ప్రతిభకు గుర్తింపుగా పలు అవార్డులూ అందుకున్నాడు. రాజకీయ నాయకులు, అధికారుల చేత శభాష్ అనిపించుకుంటున్నాడు.

పేదరికాన్ని అధిగమించి..

చిన్నతనం నుంచే పెయింటింగ్‌పై మక్కువ పెంచుకున్న రమేశ్ వివిధ వస్తువులతో కళాకృతుల తయారీపై దృష్టిసారించాడు. పెయింటింగ్‌లో ఎలాంటి శిక్షణ లేకుండానే కళాకృతులను తీర్చిదిద్దుతాడు. క్రమంగా అందులో నైపుణ్యాన్ని సాధించాడు. ఆయన కుంచె నుంచి జాలువారే అద్భుత చిత్రాలు అందరి మనసు దోచుకుంటున్నాయి. కుంచెతోనే కాదు కోడిగుడ్డుపై ప్రపంచ గ్లోబు, సబ్బు బిల్లలపై జాతీయ నాయకులు, ముగ్ధమనోహరమైన బొమ్మలు గీస్తుంటాడు. బియ్యపు గింజలపై పేర్లు, చిత్రాలు చెక్కడంలోనూ ఆయన దిట్ట. అంతే కాదు సుద్ద ముక్కలపై ఆయన గీసే చిత్రాలు చూసి తీరాల్సిందే. థర్మోకోల్‌తో జాతీయ నాయకులు, దేవుళ్లు, చారిత్రాత్మకమైన చిత్రాలను గీయడంలో అయనది అందెవేసిన చేయి. తాను గీసిన చిత్రాలకు పలు అవార్డులు, పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు. మనసులోని భావాలతో పాటు రాజకీయ నాయకులు, అధికారులు, క్రికెటర్లు, సినీ హీరోలు ఇలా ఎవరైనా సరే వారిని ఒకసారి చూశాడంటే చాలు అచ్చుగుద్దినట్లుగా వారి చిత్రాన్ని గీయడంలో ఆయన ఆరితేరాడు. ఇప్పటివరకు సుమారు 1,200కు పైగా చిత్రాలు గీశాడు. వాటితో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు కళాకారుడు రమేశ్ తెలిపాడు. ప్రభుత్వం తనకు ఆర్థికంగా చేయూతనందిస్తే ఈ కళలో మరింత రాణించి ఆసక్తి గల విద్యార్థులకు చిత్రలేఖనంలో ఉచితంగా శిక్షణ ఇస్తానని చెబుతున్నాడు.

అధికారులు, నాయకులకు అందజేత...

సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ కవిత, సీఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్, ఎమ్మెల్యేలు జోగు రామన్న, కోనేరు కోనప్ప, రేఖానాయక్ చిత్రాలు గీసి వారికి అందజేశారు. అధికారులు బదిలీపై వెళ్లిన కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ భాషాషేక్, ప్రస్తుత కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో పాటు జిల్లాకు అతిథులుగా వచ్చిన వివిధ సంస్థల చైర్మన్లకు వారి చిత్రాలను గీసి అందజేసిన ఆయన వారి చేత శభాష్ అంటూ ప్రశంసలు అందుకున్నాడు.

అల్లుడి పెళ్లికి తలంబ్రాలు తీసుకెళ్తూ అనంతలోకాలకు..

సోన్: మేనల్లుడి పెళ్లి తలంబ్రాలు తీసుకెళ్తూ 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని న్యూ వెల్మల్ గ్రామానికి చెందిన చింతకింది గంగాధర్ (44) మంగళవారం నిజామాబాద్ జిల్లా మెండోర మండలం సోన్‌పేట్ గ్రామంలోని తన మేనల్లుడి వివాహ కార్యక్రమానికి తలంబ్రాలు తీసుకెళ్తున్నాడు. మాదాపూర్ ఐబీ వద్ద గల భారత్ పెట్రోల్ పంపులో తన బైక్‌లో పెట్రోల్ పోయించుకుని వెళ్తుండగా హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంగాధర్ తల, ఇతర శరీర భాగాలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సోన్ ఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని స్వల్పంగా గాయపడ్డ కారులోని ప్రయాణికులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సుజాత, కూతురు శ్రీజ, కుమారుడు శ్రావణ్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై సంతోషం రవీందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

దిలావర్‌పూర్: మండలంలోని న్యూలోలం గ్రామ సమీపంలో నిర్మల్-భైంసా రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుండంపల్లి గ్రామానికి చెందిన గైని గణేశ్ (18) దుర్మరణం చెందాడు. వివరాలు.. మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన గైని గణేశ్ మంగళవారం మధ్యాహ్నం ఇద్దరు మిత్రులతో కలిసి ద్విచక్ర వాహనంపై సెల్‌ఫోన్ రిపేర్ కోసం నిర్మల్ పట్టణానికి బయలుదేరాడు. న్యూలోలం గ్రామ సమీపంలో ముందు వెళ్తున్న దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన ఆటో ఇండికేటర్ వేయకుండా అకస్మాత్తుగా పెట్రోల్ బంక్ వైపు తిరగగా వీరి ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నడుపుతున్న గణేశ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి



పవన్ మృతదేహం

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44పై స్థానిక శర్మ దాబా వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన పవన్ (22) చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అందజేశారు. బైక్‌ను అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారకుడైన పవన్ స్నేహితుడు సతీశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఇంద్రాదేవికి ఘనంగా విత్తనపూజ



నైవేద్యం తయారు చేస్తున్న మహిళలు



ఇంద్రాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీలు ఘనంగా విత్తనపూజ నిర్వహించారు. మంగళవారం వడగామ్, డోంగర్‌గామ్ గ్రామాలతో పాటు ఉట్నూర్, నార్నూర్, ఆదిలాబాద్, గుడిహత్నూర్ మండలాల ఆదివాసీ గ్రామాల భక్తులు వచ్చారు. చిరుధాన్యాలతో నైవేద్యం తయారు చేసి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ మహరాజ్ చహకటి సూర్యరావ్ ఉన్నారు.